

# జిల్లాకు గుర్తింపుగా ఆర్చి

- ప్రధాన గేటు పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలి..
- అభివృద్ధి పనులు వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలి..
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

నూతన కలెక్టరేట్‌లో నిర్మిస్తున్న ఆర్చి ఆకర్షణీయంగా, నాణ్యతతో, జిల్లాకు గుర్తింపుగా నిలిచేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతన కలెక్టరేట్ వద్ద నిర్మాణంలో ఉన్న ఆర్చి పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆర్చి నుంచి ప్రధాన రహదారి వరకు పరిసరాలను సుందరంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రధాన గేటు నిర్మాణంతో పాటు రహదారి, ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని ఆకట్టుకునేలా ఆర్చి నిర్మాణం ఉండాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను సమన్వయంతో నిర్వహిస్తూ కలెక్టరేట్ పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, రహదారులు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ కుమారస్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలి

- ముర్రుపాలు అమృతంతో సమానం.. తొలి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలి..
- జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, అప్పుడే శిశువు జీవితాంతం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండే అవకాశాలు మెరుగుపడతాయని జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కరీంనగర్‌లోని జ్యోతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు నిర్వహించిన కౌన్సెలింగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని అవగాహన కల్పించారు. ముర్రుపాలు అమృతంతో సమానమని, తల్లిపాలలో రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు అధికంగా ఉంటాయని తెలిపారు. శిశువు పుట్టిన తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే ఆహారం ఇవ్వకూడదని, ఆ తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం బిడ్డ ఎదుగుదలకు ఉపయోగపడుతుందని చెప్పారు. గర్భిణీలు, బాలింతలు బలవర్ధక ఆహారం తీసుకోవాలని, తల్లిపాలు ఇవ్వడంలో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ వెంకటలక్ష్మి, చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ మహేష్, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**శెనార్తి మీడియా, జగిత్యాల:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, రెండో విడత ఇళ్ల కేటాయింపును నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపట్టాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హౌసింగ్ పీడీ భాస్కర్, డీఈ సత్యనారాయణతో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, రెండో విడతలో మరో 2,000 ఇళ్లకు ఆమోదం లభించిందని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలోని ఐదు మండలాలు, జగిత్యాల, రాయికల్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 60 శాతం గ్రామీణ ప్రాంతాలకు, 40 శాతం పట్టణ ప్రాంతాలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం, అంతకుమించి బాలింతకు ఆరోగ్యకరమని బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పాపయ్యపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు అందించాలని, వాటి ద్వారా శిశువుకు అవసరమైన పోషకాలు లభిస్తాయని తెలిపారు. తల్లిపాలు శిశువు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి తల్లి బిడ్డకు తగినంత కాలం తల్లిపాలు అందించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు డ్రెస్సులు, కోడిగుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దూమల మహేష్, వార్డు సభ్యులు లింగాల వెంకటేష్, తిప్పారపు మహేష్, పొట్లపల్లి శివకృష్ణ, అంగన్‌వాడీ సూపర్వైజర్ భవాని, టీచర్ జమున, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు

# బాలలు హక్కులు తెలుసుకోవాలి



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బాలలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కల్లేపల్లి సర్పంచ్ బిగుల్ల మెహన్ అన్నారు. గ్రామాల్లో పిల్లల హక్కులు, సమస్యలపై చర్చించడానికి, నిర్ణయాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి గ్రామ పంచాయతీలు నిర్వహించే ప్రత్యేక వేదికే బాలల గ్రామసభ అని పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, రక్షణ వంటి అంశాలపై పిల్లల గొంతును వినిపించేందుకు బాలల గ్రామసభలు దోహదపడతాయని తెలిపారు. సభలో విద్యార్థులు ప్రస్తావించిన సమస్యలను నోట్ చేసుకున్న సర్పంచ్, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినీత్ గౌడ్, గ్రామ కార్యదర్శి రాకేష్, వార్డు సభ్యులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు దర్శన్, సత్యం, పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# సేవా స్ఫూర్తిని చాటిన పారమిత విద్యార్థులు

- స్కూల్ చైర్మన్ జన్మదినం సందర్భంగా అనాథ, వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకుల అందజేత

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు సేవాస్ఫూర్తిని చాటారు. ఈ వేడుకల్లో భాగంగా పారమిత ఫిలాంత్రఫీ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ, వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు, నగదు సహాయాన్ని అందజేశారు. రామడుగు మండలం వెలిచాలలో మంచికంట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పందన అనాథ వృద్ధుల ఆశ్రమానికి, జమ్మికుంటలో గోపరాజు వీరస్వామి ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్పందన ఆర్గనైజేషన్ వాలంటీర్ సంస్థకు పారమిత విద్యార్థులు నిత్యావసర సరుకులను అందించారు. 8 క్వింటాళ్ల బియ్యం, 17 కిలోల చింతపండు, 60 కిలోల పప్పుధాన్యాలు, 35 లీటర్ల వంట నూనె ఉన్నాయి. పాఠశాల యాజమాన్యం తరపున రూ.50 వేల నగదు సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దానగుణం, ఔదార్యం, సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించాలనే ఉద్దేశంతో ఫిలాంత్రఫీ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, దానధర్మాల ప్రాధాన్యతను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో పారమిత విద్యాసంస్థల నుంచి మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, రాకేశ్, ప్రాచీ, అనుకర్ రావు, వినోదరావు, వి.యు.ఎం. ప్రసాద్, హనుమంతరావు, హెచ్ఎంలు ప్రశాంత్, బాలాజీ, గోపీకృష్ణ, శ్రీకర్, శర్మిష్ఠ, కవిత ప్రసాద్, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజల భాగస్వామ్యంతోనే. గ్రామాల అభివృద్ధి

- రామడుగు ఎంపీడీవో రాజేశ్వరి

**శెనార్తిమీడియా, రామడుగు:**

గ్రామాల అభివృద్ధి చెందాలంటే ప్రజల బాధ్యత ఉండాలని రామడుగు ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు. మండలంలోని షానగర్ గ్రామపంచాయతీలో మంగళవారం గ్రామ సర్పంచ్ గునుకొండ శైలజ అధ్యక్షతన ఏర్పాటుచేసిన గ్రామ సభ కు హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వర్షా బావ పరిస్థితి దృశ్య రైతులు నీటిని కాపాడుకోవాలి కోరారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం తమమైన మార్గమని తెలిపారు. ప్రణాళిక బద్ధంగా నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామంలోని మాలిక వసతులు కల్పిస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ గునుకొండ శైలజ, మాజీ సర్పంచ్ గునుకొండ అశోక్ కుమార్, ఉప సర్పంచ్ చిరుత అంజయ్య వార్డు సభ్యులు పర్లపెల్లి పుష్పలత, సైన్ల స్వప్న, ఏంటి శంకర్, కొత్త రమ్యకృష్ణ పంచాయతీ కార్యదర్శి మధుసూదన్, ఏఈఓ అర్చన తదితరులు పాల్గొన్నారు

# రోగులకు నాణ్యమైన వైద్య సేవలు



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని బెజ్జంకి మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ గౌడ్ సూచించారు. మంగళవారం ఎంపీడీఓ ప్రవీణ్‌తో కలిసి బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో వైద్యాధికారి మాధురి, సూపర్వైజర్ సులోచన, ఏఎన్ఎంలు అనిత, సరోజన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెన్షన్ దరఖాస్తులకు నేడే గడువు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



శంకరపట్నం మండల పరిధిలోని 27 గ్రామ పంచాయతీల్లో వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళల చేయూత పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే వారికి నేటితో గడువు ముగియనుంది. అర్హులైన దరఖాస్తుదారులు ఈరోజు (ఆగస్టు 5) సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు సమర్పించాలని ఎంపీడీఓ తెలిపారు. దరఖాస్తులతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను తప్పనిసరిగా జత చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీఓ కోరారు.

# ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

- నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలి..
- సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై జీరో టాలరెన్స్‌తో చర్యలు చేపట్టాలి..
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**శెనార్తి మీడియా, మెట్‌పల్లి:**




ప్రజా ఫిర్యాదులపై ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే స్పందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, స్టేషన్ పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలను సమీక్షించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తులు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిఘా తదితర అంశాలను పరిశీలించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై కూడా ఆరా తీశారు. నేరాలను ముందుగానే అరికట్టేలా ఇంటెలిజెన్స్ సేకరణ, బీట్ వ్యవస్థ, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు, అనుమానితులపై నిఘా, సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జైలు నుంచి విడుదలైన నేరస్థుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలని, గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగించాలని తెలిపారు. యువతలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయడానికి గ్రామాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఓటీపీ, కేవైసీ, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. రోడ్డు భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, మైనర్ల వాహన వినియోగం, ప్రమాదకర డ్రైవింగ్, మోడిఫైడ్ సైలెన్సర్లపై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. తనిఖీలో డీఎస్పీ రాములు, ఎస్ఐలు కిరణ్ కుమార్, రాజు నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మనస్తాపం.. వృద్ధుడు ఆత్మహత్య

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన అడితం రాజయ్య (70) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కేశవపట్నం పోలీసులు తెలిపారు. గత కొంతకాలంగా సెల్యులైటిస్, మధుమేహం, క్షయ వ్యాధి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన రాజయ్య, ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డు పైపుకు తాడుతో ఉరివేసుకుని మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు అడితం ఐలుకొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## కన్నాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అడితం కుమార్

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



శంకరపట్నం మండలం కన్నాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా అడితం కుమార్ ఎన్నికైనట్లు మండల అధ్యక్షుడు బండారి తిరుపతి తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్ష పదవికి అడితం కుమార్‌తో పాటు మరో ఇద్దరు పోటీ చేయగా, ముఖ్య కార్యకర్తల మద్దతుతో కుమార్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. నూతనంగా గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన అడితం కుమార్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## అక్రమ మట్టి తరలింపు.. ముగ్గురిపై కేసు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**




హుజురాబాద్‌కు చెందిన సంపంగి మల్లయ్య, సంపంగి రమేష్, ఒద్యారంకు చెందిన సవనపల్లి వెంకటస్వామి అక్రమంగా మట్టి తరలిస్తుండగా అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. మంగళవారం కాచాపూర్ గ్రామ శివారులో హిటాచీ యంత్రంతో పాటు TS12 UD 0519, TS12 UD 6245 నంబర్ల టిప్పర్లను ఉపయోగించి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వాహనాలను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు.

